ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 17 జూన్, 2025 | పేజీలు :8

## రాజన్నను దర్శించుకున్న ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ మంత్రి అడ్లూరి



**ప్రజా పక్షం/ వేములవాడ:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విప్ ఆది శ్రీనివాస్ లకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.స్వామి వారికి కోడె మొక్కు చెల్లించుకొన్న అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. కల్యాణ మండపం లో మంత్రి ,విప్ లకు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వదించిన అనంతరం ఆలయ ఈఓ రాధ బాయ్ శేష్ వస్త్రం అందించి లడ్డు ప్రసాదం తో పాటుగా స్వామి వారి చిత్రపటంను అందజేశారు.

# వేములవాడ అభివృద్ధికి నూతన దశ

- రాజన్న ఆలయ విస్తరణ, రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం
- గత ప్రభుత్వ పనితీరుపై విమర్శలు
- ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/ వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా లోని వేములవాడ పట్టణ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం తెలిపారు. వేములవాడ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజన్న సన్నిధిలో అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయి. 80 అడుగుల వెడల్పుతో రోడ్డు పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నూటయాభై ఎనిమిది కోట్లతో ప్రధాన రోడు అభివృద్ధి పనులు ప్రారంభించామని ఆయన అన్నారు. 2023 నవంబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 8 మంది మంత్రుల సమక్షంలో వేములవాడ అభివృద్ధికి పెద్ద ఎత్తున శంకుస్థాపనలు జరిగినట్లు ఆయన గుర్తుచేశారు. వీటిలో ఆలయ విస్తరణకు డెబ్బై ఆరు కోట్ల కేటాయించమని, పట్టణ రోడ్డు వెడల్పుకు నలపై ఏడు కోట్లు, అన్నసత్రం నిర్మాణానికి ముప్పై ఐదు కోట్లు కేటాయించబడ్డాయన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో యాబై ఆరు కోట్లు, 2025–26 బడ్జెట్‌లో మరో వంద కోట్లు కేటాయించబడ్డాయి. ఇది రాజన్న ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధిని సమాంతరంగా తీసుకెళ్లే సంకల్పానికి నిదర్శనం అని అన్నారు.



శృంగేరి పీఠ సూచనలతో ఆలయ విస్తరణ.. వేములవాడ ఆలయాన్ని 4 ఎకరాల్లో విస్తరించడానికి శృంగేరి పీఠానికి నాలుగుసార్లు వెళ్లి సలహాలు తీసుకున్నాం. శాస్త్రీయంగా, ఆధ్యాత్మికంగా ఈ ప్రాజెక్ట్ ముందుకు వెళ్తోంది, అని వివరించారు.

గత ప్రభుత్వంపై విమర్శలు.. అభివృద్ధిపై వాస్తవత లేదంటూ ఆరోపణలు గత ప్రభుత్వ హామీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కేసీఆర్ రాజన్న మెట్లపై నుండి దిగుతుంటే మీద ఇచ్చిన మాటలు నెరవేర్చలేదు. నా లగ్గం ఇక్కడే అయిందని, అత్తగారు కోదురుపాక అని ప్రజలను మభ్యపెట్టారు. వంద కోట్లు తక్షణమే విడుదల చేస్తానని చెప్పినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పడక ముందు ఆలయం ఎలా ఉందో ఇప్పటికీ అలాగే ఉంది. ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. బ్రోచర్లలో మాత్రమే అభివృద్ధిని చూపించారు. 3వ బ్రిడ్జి ఉండకపోయినా వీడియోల్లో చూపించారు, అంటూ ఎద్దేవా చేశారు. భూముల స్వాధీనం, నష్టపరిహారం చెల్లింపు.. రోడ్డు వెడల్పు కోసం భూములు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. భూములు ఇచ్చిన వారి త్యాగాన్ని ఎప్పటికీ మర్చిపోం అన్నారు. వ్యాపారుల అభ్యున్నతికి ప్రభుత్వం అండ ఉంటుందని అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతోందని, గత కొన్ని సంవత్సరాలుగా వ్యాపారం చేస్తున్న దుకాణదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. భక్తులు, పట్టణ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

రేవంత్ మాటలకు నేడు రూపురేఖలు

అనాడు పిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలకు నేడు అడుగులు పడుతున్నాయి. భవిష్యత్తులో వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## రామగుండం కార్పొరేషన్ 60 డివిజన్లుగా

✲ పునర్విభజనపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక సంస్థను 60 డివిజన్లుగా పునర్విభజన చేయడం జరుగుతుందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్, నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ డివిజన్ల పునర్విభజనపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్‌లో లింగాపూర్, వెంకటరావునగర్, ఎఫ్‌సిఐ, ఎల్కలపల్లి గేట్, అక్బర్‌నగర్ గ్రామాలను విలీనం చేసి 50 నుంచి 60 డివిజన్లుగా పునర్విభజన చేయాలని సీడీఎంఏ సూచించిందని తెలిపారు. డివిజన్ల పునర్విభజన డ్రాఫ్ట్‌ను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంటు సిటి ప్లానర్ శ్రీహరి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నవీన్, రెవెన్యూ అధికారి అంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారుల సమన్వయంతో చర్యలు

కలెక్టర్ కుమార్ దీపక్



2 లో

# రైతులతో సీఎం ముఖాముఖి కార్యక్రమం

## అంతర్గాంలో పాల్గొన్న కలెక్టర్



ప్రజాపక్షం/గోదావరిఖని : రైతులతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి రైతు వేదిక సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రైతులతో సీఎం ముఖాముఖి కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పంట మార్పిడి ద్వారా రైతులు అధిక లాభాలను సంపాదించాలన్నారు. సంవత్సర కాలంలో రైతుల సంక్షేమానికి 70 వేల కోట్ల వ్యయాన్ని ఖర్చు చేసినట్లు తెలిపారు. 9 రోజుల వ్యవధిలో రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ కానున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. రైతుల ద్వారా సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. తహసీల్దారు తూము రవీందర్ పటేల్, ఎంపీడీవో వేణుమాధవ్‌పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణం సురక్షితం



ప్రజాపక్షం / మల్లాపూర్ : ప్రయాణికులను గమ్యాన్ని చేర్చేందుకు ఆర్టీసీ బస్సులు ప్రయాణం భద్రతతో పాటు సురక్షితమని మెట్‌పల్లి డిపో మేనేజర్ టి.దేవరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ముత్యంపేట గ్రామంలో గ్రామస్తులతో సమీక్ష ఏర్పాటు చేశారు. నూతనంగా ఖానాపూర్ నుండి ఆర్మూరు మీదుగా హైదరాబాద్ కు లగ్జరీ బస్సు సేవలు ప్రారంభించామని ప్రయాణికులు ఇట్టి సేవలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

## వికసిత భారత్ సంకల్ప సభ

ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప సభ తిప్పాపురంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ 11 ఏళ్ల మోడీ పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూనే రైతాంగ అభివృద్ధి డిజిటల్ భారత్ వైపు ముందుకు తీసుకెళ్లడం ప్రసాద్ పథకం ద్వారా త్వరలో రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు కూడా మంజూరు చేయడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు తిప్పాపురం వార్డ్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత

ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సోమవారం రూ.14,300 అందించారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పి ఉన్నత పాఠశాలలో చదివి 2013–14 సంవత్సరంలో ఎస్సెస్సీ పూర్తిచేసుకున్న విద్యార్థులు పాఠశాలలోని మధ్యాహ్న భోజనం కోసం ఏర్పాటు చేసిన షెడ్డు శిథిలావస్థకు చేరిన విషయాన్ని గుర్తించి దాని మరమ్మతులకై 201314 బ్యాచ్ విద్యార్థులు తలా కొంత మొత్తాన్ని సేకరించగా రూ.14300 ప్రోగయ్యాయి. సదరు మొత్తాన్ని పాఠశాల హెచ్ఎం కు అందించి కిచెన్ షెడ్డు మరమ్మతులకై ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ హెచ్ఎం ఎస్.వేణుమాధవ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కాసర్ల వెంకట రమణ, పెండ్యాల రాజేష్, గ్రామ మాజీ సర్పంచ్ వేముల లింగన్న, మాజీ ఎంపిటిసి మల్లేష్, తిరుపతి, గ్రామ యువకులు, ఎస్సెస్సీ మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన నాయకులు



ప్రజాపక్షం/గొల్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాఘువపట్నం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశానుసారం ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి ముగ్గులు పోసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు .అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగిస్తూ దేశంలో ఇందిరమ్మ కన్న కలలు సహకారం చేస్తూ నిరుపేద కుటుంబాలకు ఇల్లు మంజూరు చేస్తున్నారని అన్నారు .ఈ కార్యక్రమంలో కాసారపు ప్రవీణ్ గౌడ్ ,ఏఎంసీ డైరెక్టర్ ఊట్కూరి సురేందర్ రెడ్డి ,సింగిల్ విండో డైరెక్టర్ కొలగాని జలంధర్ ,చిట్యాల శ్రీకాంత్ ,బోయపోతు రాజేశం ,గంగాధర్ ,కోలగాని అశోక్ ,మల్లయ్య ,లచ్చయ్య ,కుంభాల లచ్చిరెడ్డి ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు ,పంచాయతీ కార్యదర్శి ,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు .ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## వేములవాడ పట్టణంలో మొదలైన రోడ్ వెడల్పు పనులు

ప్రజా పక్షం/ వేములవాడ: వేములవాడ లో రోడ్ల విస్తరణ కార్యక్రమాన్ని ఆదివారం రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. వేములవాడ మూలవాగు నుండి రాజన్న దేవాలయ వరకు విస్తరణ చేయాలని అధికారులు తీసుకున్నానే దానికి కొంతమంది నిర్వాసితులు కోర్టును ఆశ్రయించడంతో, ప్రస్తుతం మూలవాగు నుండి మటన్ మార్కెట్ వరకు కూల్చివేతలను ప్రారంభించిన అధికారులు.అమరవీరుల స్తూపం నుండి రాజన్న ఆ లయం వరకు కూల్చివేతలు.60 మంది వరకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించిన కలెక్టర్. మిగతా నిర్వాసితుల చెక్కులను కోర్టులో డిపాజిట్ చేసినట్లు అధికారుల వెల్లడి.పోలీస్‌లతో బందోబస్తు ఏర్పాటు కూల్చివేతలు ప్రారంభించిన అధికారులు. మూలవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు రోడ్ వెడల్పు కోసం 47 కోట్లు కేటాయించిన ప్రభుత్వం. మరో మూడు నాలుగు రోజుల్లో పూర్తి చేయనున్న కూల్చివేత పనులు.

## కుమారుడి మరణానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

### రాజన్న ఆలయ ఇఒ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజా పక్షం/ వేములవాడ: రాజన్న ఆలయంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగా పని చేస్తున్న తమ కుమారుని మరణానికి కారణమైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ధర్నాకు దిగిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రాజన్న ఆలయంలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించే పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన పెంట ఓంకార్ పై ఆలయంలో పనిచేసే అధికారులు విధులకు ఆలస్యంగా వచ్చాడని కులం పేరుతో దూషించడంతోనే తీవ్ర మానసిక క్షోభ కు గురై గత నెల 30న ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆలయ ఈవో ప్రధాన ద్వారం ముందు ధర్నా నిర్వహించారు. ఈ విషయం తమకు ఆలస్యంగా తెలిసిందని,కుల అహంకారంతో నాలుగో తరగతి ఉద్యోగులను ఇలా అనేక మందిని అనేకసార్లు అవమాన పరుస్తున్నారని ఆరోపించారు.తమ కుమారుడి మృతికి కారణమైన సంబంధిత ఆలయ అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకొని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు.

## పాత్రికేయునిపై అక్రమ కేసులు సరికాదు

ప్రజాపక్షం / మల్లాపూర్ : జనం సాక్షి పత్రిక ఎడిటర్ రహమాన్‌పై అక్రమంగా కేసులు పెట్టి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడం సరికాదని మల్లాపూర్ మండల పాత్రికేయ మిత్రులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజలను చైతన్య పరుస్తున్న పత్రికా విలేకరులపై ప్రశ్నించే అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ప్రశ్నించే గొంతుకను నొక్కడం ప్రభుత్వానికి సరైంది కాదని తక్షణమే అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ తాసిల్దార్ రమేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల ప్రెస్ క్లబ్ సభ్యులు రమేష్, సంజీవ్, పవన్, రాజశేఖర్, మల్లేష్, సతీష్, రంజిత్, రాజేందర్, గంగాధర్ తదితరులున్నారు.

## బడిబాట విద్యార్థులకు పూలబాట

ప్రజాపక్షం / ధర్మపురి : బడిబాట విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పూలబాట అని జగిత్యాల జిల్లా ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ అన్నారు. ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎంసి చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. లావణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, బోధనా సేవలు ఉంటాయన్నారు.సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి రెండు జతల దుస్తులతోపాటు పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తున్నదని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా వారానికి మూడు సార్లు గుడ్లు,రాగి జావ అందిస్తున్నదని పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం మహేష్, ఉపాధ్యాయులు మ్యాన పవన్ కుమార్, ఆసిఫ్,సూర్య తేజ పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారుల సమన్వయంతో చర్యలు

ప్రజాపక్షం/ నస్పూర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధితఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం / హుజూరాబాద్ : హైదరాబాదులోని సోమాజిగూడలో కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని సోమవారం రోజున హుజూరాబాద్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ప్రజల మనుగడని, అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ అని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ సొల్లు సారయ్య, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సొల్లు బాబు, మాల మహానాడు నాయకుడు పాక సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండెపు సారంగపాణి, కరీంనగర్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ బండి మల్లేశం, కత్తెర మల్ల సదానందం తదితరులు పాల్గొన్నారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు భరోసా కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాపక్షం/గొల్లపల్లి : 2025 వానాకాలం రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. 5 జూన్ 2025 నాటికి భూభారతి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అర్హులుగా పేర్కొన్నారు. రైతులు రైతు భరోసా అప్లికేషన్ ఫారం ,ఆధార్ కార్డు ,పట్టాదారు పాస్ పుస్తకం,బ్యాంక్ ఎకౌంట్ యొక్క జిరాక్స్ వెంటనే తీసుకొని మండలంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ విస్తరణ అధికారికి,లేదా సంబంధిత ఏఈవో,లకు ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరుతున్నారు. రైతు భరోసా పొందుతున్న వారు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## రైతులకు రైతు భరోసా అందిస్తామని సిఎం హామీ



ప్రజాపక్షం / మల్లాపూర్ : మల్లాపూర్ చిట్టాపూర్ మొగిలిపేట గ్రామాలలోని రైతు వేదికలలో ఏర్పాటుచేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు. కాగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి స్వయంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవడం సంతోషదాయకమని రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రత్యేక అధికారి సత్యం, ఎం ఏ ఓ లావణ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పలత నర్సయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, ఏఈఓ లు గజానంద్, వంశీ, వినీత, వైష్ణవి, అనిల్, రైతులు పాల్గొన్నారు.

# ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే

గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 23 ఫిర్యాదులు స్వీకరణ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టప రంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రజా సమస్యలు పరిష్క రించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## కారు, బైక్ ఢీ :ఒకరికి గాయాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** ద్విచక్ర వాహనం కారు ఢీకొన్న సంఘటనలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన కట్ల పవన్ కు తలకు,పొట్ట భాగంలో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామపంచాయతీ పరిధిలోని బగుళ్ల దేవాలయ ప్రాంగణంలో స్నానాలు చేసేందుకు పోతారం గ్రామానికి చెందిన కట్ల పవన్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆదివారం పేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకున్న కారుతో వెళ్లి తిరిగి వస్తుండగా పవన్ కి కారు ఢీకొట్టడంతో గాయాలైనట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని అన్నారు. గాయాల పాలైన పవన్ ను కరీంనగర్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని తెలిపారు.

## జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/జమ్మికుంట:**జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చందు వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఫార్మసీ రూం, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. ఆరోగ్యశాఖ సిబ్బందికి పలు విషయాలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్‌సిడి క్లినిక్స్, హైపర్ టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. లెప్రసీ సర్వేను ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామంలో విధిగా నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రాథమిక కేంద్రాలలో సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, సూపర్‌వైజర్ సదానందం, ఫార్మసిస్ట్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్ తదితరులున్నారు.

# రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇబ్రహీం నగర్ ,వెనుగుమట్ల,గొల్లపల్లి లోని రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించడం జరిగింది .రైతు వేదికల ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రైతులకు సూచనలు సలహాలు చేశారు .రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా ముఖాముఖి ,ఆదర్శ రైతుల అనుభవాలు ,వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు ,ఎరువుల వాడకం ,వంగడాల ఎంపిక ,కలుపు నివారణ అధిక వర్షాల వేల పంటల వారీగా తీసుకోవలసిన జాగ్రత్తలు నూతన ఆవిష్కరణలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు .సీఎం రేవంత్ రెడ్డి పాలనలో మన రైతులు సుభిక్షంగా ఉండేందుకు ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని పథకాలను ఇప్పటికీ అమలు చేసి వివిధ రాష్ట్రాలకు ఒక దశ దిశ చూపించారని అన్నారు .అదేవిధంగా రుణమాఫీ ,సన్న వడ్లకు బోనస్ అన్ని రకాల పంటలకు మద్దతు ధర కొనుగోలు అన్ని పంటలకు రాయితీపై సూక్ష్మ సేంద్య పరికరాల సరఫరా వంటివి అందించినట్లు తెలిపారు .కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషోర్, ఎంపీడీవో రామ్ రెడ్డి ,ఎంపీ ఓ సురేష్ రెడ్డి ,వ్యవసాయ అధికారి కరుణ ,వ్యవసాయ విస్తరణ అధికారులు గంగాధర్ ,అశ్విని ,సంధ్య ,శివ లీల వివిధ గ్రామాల రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి

కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సలీం



**ప్రజాపక్షం/ముత్తారం :** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సలీం కోరారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడు గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. కళాశాల ప్రత్యేకతలు వివరిస్తూ రూపొందించిన ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం, కళాశాల అధ్యాపకులు ఇన్చార్జి ప్రిన్సిపల్ లక్ష్మీ నరసింహారావు, బన్స్ లాల్,రాజేశం,పూర్ణ చందర్,లింగమూర్తి, రుక్మ, జెరూష, శ్రీనివాస్, శివదాస్, వెంకటకృష్ణారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అశోక్, రాజనర్సుతో పాటు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు భయపడం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**ప్రజాపక్షం/ముత్తారం/ మంథని :** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అభివృద్ధిని మరిచి కుటిల రాజకీయాలకు పాల్పడుతోందని, కాంగ్రెస్ కుట్రలు,బెదిరింపులకు భయపడేది లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ ముందు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ హాజరు కానున్న నేపథ్యంలో కేటీఆర్ కి మద్దతు గా మంథని నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో భీఆర్ఎస్ పార్టీ నాయకులు హైదరాబాద్ తెలంగాణ భవన్ కు తరలివెళ్లారు.మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో పాటు పలువురు నాయకులతో కలిసి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మానిఫెస్టో, హామీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, హామీలను అమలుచేయాలని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ పార్టీ నాయకులను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. నోటీసులు, విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారని, ప్రతి అంశాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ప్రతిపక్ష హోదాలో ప్రశ్నిస్తూనే ఉంటామని, ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేయమని ఆయన ఈసందర్భంగా స్పష్టం చేశారు.

## నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

డిపిఒ వీర బుచ్చయ్య



**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామాల్లో నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డిపిఓ వీర బుచ్చయ్య అన్నారు. పెద్దపల్లి జిల్లాముత్తా రం మండలంలోని ఓడేడు గ్రామ ంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన నర్సరీ, సేగ్రేషన్ షెడ్లు, క్రిమిటోరియన్ లను డిపిఓ సోమవారం సందర్శించారు. నర్సరీలో ఏయే మొక్కలు పెంచుతున్నారో పరిశీలించా రు.మొక్కలకు ఎప్పటికప్పుడు నీళ్లు పోస్తూ ఏపుగా పెరిగేలా చర్య లు తీసుకోవాలన్నారు. పిచ్చిమొక్కలు పెరిగితే వెంటనే తొలగించాలని, వాచర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సరీలపై షెడ్‌నెట్లను మొక్కలకు గాలి తగిలేలా ఏర్పాటు చేయాలని సూచించారు.ఓడేడ్ గ్రామానికి సరిపోయే మొక్కలు పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీ ఓ గోవర్ధన్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్ తోపాటు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## 18న హైదరాబాద్ ఆర్టిజన్స్ బహిరంగ సభ

పెద్దపల్లి జిల్లా జెఎసి కో చైర్మన్ విశ్వనాథ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ ;**విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ సమస్య సాధన కొరకు ఈనెల 18న జరుగనున్న చలో హైదరాబాద్ బహిరంగ సభకు పెద్దపల్లి జిల్లాలోని ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టివిఎసి జెఎసి పెద్దపల్లి జిల్లా కో చైర్మన్ దుర్గం విశ్వనాథ్ పిలుపునిచ్చారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతలు బట్టి కన్వర్షన్ చేయాలని జెఎసి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్ల ఆర్టిజన్ కార్మికులు కుటుంబసభ్యులతో కలిసి బహిరంగ సభనిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న 20వేల మంది ఆర్టిజన్ కార్మికులు కుటుంబాలతో తరలిరావాలని కోరారు.

# శరవేగంగా సాగుతున్న రోడ్డు పనులు



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గంగాపూర్ టు బుగ్గారం రోడ్డు కొరకు గతంలో రెండు శిలాఫలకాలు పెట్టిన పనులు చేయలేక వదిలేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఎస్సి, ఎస్టి, మైనార్టీ శాఖ మాత్యులు అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించి గంగాపూర్ టు బుగ్గారం రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీచేయడంతో పనులను వెంటనే ప్రారంభించి వేగంగా రోడ్డు పనులు సాగిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం బుగ్గారం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడుతూ అతి త్వరలో గంగాపూర్ టు బుగ్గారం రోడ్డు పనులు పూర్తి చేస్తామని, మండలంలో ప్రభుత్వ భవనాలు అభివృద్ధి పనులు అన్ని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నగునూరి నర్సాగౌడ్, యశ్వంత్‌రావుపేట్ మాజీ సర్పంచ్ తాండ్ర సత్యనారాయణ, వెలుగొండ మాజీ సర్పంచ్ కొండపల్లి సంతోష్‌రావు, యశ్వంత్‌రావు , గ్రామశాఖ అధ్యక్షులు ఉరిమెట్ల సంతోష్ , బంగారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలపై చర్యలు

ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అంగూరి రంజిత్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి వినోద్ కు రాష్ట్ర అధ్యక్షులు అంగూరి రంజిత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అనేక పాఠశాలలు అనుమతులు లేకుండా నడుస్తున్నాయనీ అనేక ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుట దోపిడి గురి చేస్తున్నారని వారన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం నిరుపేదలకు 25 శాతం ఉచిత విద్య ఏ ఒక్క పాఠశాలలో కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇష్టాను సారంగా ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేసి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు హెచ్చరించారు.

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ డి.వేణు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామానికి చెందిన సెట్టు సురేష్ పెద్దపల్లి జిల్లా పరిధిలో ఎన్ని కబేరాలు ( గేదేలు, ఆవులు, ఎద్దులు) కోయడానికి ఎన్ని షాపులకు అనుమతులు ఉన్నాయో వివరాలు తెలుప గలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా కలెక్టరేట్ సి విభాగం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం పెద్ద కాల్వల గ్రామానికి చెందిన బోంగు రాజమ్మ భర్త: మల్లయ్య తనకు బోదకాలు ఉన్నందున దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ డీఆర్డీఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.సుల్తానాబాద్ మండలం తోగ్రాయి గ్రామానికి చెందిన పాలకుర్తి లక్ష్మి గ్రామ శివారు సర్వే నెంబర్ 645 లో తమ కుటుంబానికి చెందిన భూములను తనకు తన కుమారునికి తెలియకుండా రెండవ కోడలు పాలకుర్తి రజిత తన పేరు మీద పహాణీలో పట్టాదారుగా నమోదు చేస్తుందని, చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తమ భూమి తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీఓ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణిలో జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి నగదు అందజేత



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:**గోదావరిఖని సింగరేణి సూపర్ బజార్లో పనిచేస్తున్నటువంటి తోటి కార్మికుడు మరియు ప్రజా కళాకారుడు సంబోదు కొమురయ్య గత రెండు నెలల నుంచి పక్షవాతంతో బాధపడుతున్న నేపథ్యంలో సోమవారం సింగరేణి సూపర్ బజారు సిబ్బంది కలిసి జనగామ లోని కొంరయ్య ఇంటికి వెళ్ళి నిత్యావసర సామాన్లు మరియు తోటి సిబ్బంది దగ్గర వసూలు చేసిన డబ్బులను కొంరయ్య కుటుంబానికి అందజేయడం జరిగిందని సింగరేణి సూపర్ బజారు ఇంచార్జీ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తోటి సిబ్బంది వెంకన్న, రాజయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## డివైఎస్ఓను కలిసిన జూడో సంఘం ప్రతినిధులు



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్‌ను సోమవారం జిల్లా జూడో సంఘం ప్రతినిధులు కలిసి శాలువా బొకేలతో సన్మానించి అభినందించారు. ఈ సంధర్భంగా డివైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో జూడో క్రీడా అభివృద్ధికై కృషి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం త్వరలో జరగబోయే జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ పోటీలపై వారు చర్చించారు. జిల్లా జూడో సంఘం ప్రతినిధులు దామోదర్, మన్నాన్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించిన పుట్ట మధు



**ప్రజాపక్షం/ముత్తారం :** హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సోమవారం పరామర్శించి,ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## మైనార్టీ కళాశాలను మంథనికు తరలించకండి

### ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మంథనిలో ఏర్పాటుచేసిన గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలను పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పుడు ఆ కళాశాలను తిరిగి మంథనికి తరలించడంతో ఇక్కడ చదివే విద్యార్థినులకు అసౌకర్యం కలుగుతుందని, ఆ కళాశాలను పెద్దపెల్లి జిల్లా కేంద్రం లో ని కొనసాగించాలని పెద్దపల్లి ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బాలుర, బాలికల కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని, మంథనిలో ఏర్పాటుచేసిన బాలికల జూనియర్ కళాశాలను అక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో పెద్దపెల్లి జిల్లాలోని రాఘవపూర్ గ్రామంలో ఏర్పాటు చేశారని, పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో కూడా ఒక కళాశాల ఏర్పాటు చేశారని కానీ పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని గురుకుల కళాశాలలో సిఇసి, ఎం ఈ సి, సబ్జెక్టులు పెట్టారని, మంథని కళాశాలలో బైపిసి, ఎంపీసీ సబ్జెక్టులు పెట్టారని పెద్దపెల్లి జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న పలు మండలాల్లో ఉన్న నిరుపేద ముస్లిం అమ్మాయిలు ఎక్కువగా బైపిసి, ఎంపీసీ సీట్లలో భర్తీ అయ్యారని, ఆ కళాశాలను మంథని కి తరలిస్తే ఎక్కువ శాతం అమ్మాయిలు మంథనికి వెళ్లే పరిస్థితి లేదని, ప్రభుత్వ అధికారులు, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విజయ రమణారావు ఈ విషయమై చొరవ తీసుకొని మంథని కళాశాలను పెద్దపెల్లి జిల్లా కేంద్రం లోనే కొనసాగిచ్చేటట్టు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఎ మోహిద్, అబ్దుల్ హై జావిద్, ఏ ఆర్ షాకీర్, మహమ్మద్ రహీం, మొహమ్మద్ జహెద్, తబ్రేజ్ ఖాన్ ,మహమ్మద్ షహ బాజ్, సయ్యద్ యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాల తరలిస్తే ఆందోళన తప్పదు టిడిపి

## ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ ఘనంగా ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**కరీంనగర్‌లో అత్యాధునిక సౌకర్యాలతో హోలిస్టిక్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే సిబిఎస్ఈ కారికులం అనుసరిస్తున్న ట్రినిటి ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ సోమవారం ఘనంగా ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రినిటీ విద్యాసంస్థల కార్యదర్శి, సంచాలకుడు దాసరి మనోహర్ రెడ్డి హాజరై ప్రారంభించి మాట్లాడారు. ట్రినిటీ విద్యాసంస్థలు విద్యను ఒక సేవగా భావించి సమాజానికి మంచి నాయకులను అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. కరీంనగర్‌లోని పిల్లలంతా ప్రపంచ స్థాయి విద్యను స్వగ్రామంలోనే పొందాలన్న దృష్టితో ఈ సంస్థను నెలకొల్పుతున్నామని తెలిపారు. ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్‌లో విద్యార్థుల మొత్తం అభివృద్ధికి అనుకూలంగా అత్యుత్తమ ఉపాధ్యాయ బృందం, సమగ్రమైన బోధనా విధానాలు, ప్రపంచ ప్రమాణాలకు సరిపోయే ఆటదళాలు, విశాలమైన ఆటస్థలంతో కూడిన అద్భుతమైన క్రీడా వేదికలు అందుబాటులో ఉన్నాయన్నారు. తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ విధ్యార్థుల భవిష్యత్తు కోసం ఈ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ సమాజానికి గొప్ప నాయకులను తయారు చేసే గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో ప్రారంభమైన రైతు నేస్తం కార్యక్రమాలు

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖా అద్వర్యంలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ మండలం కనుకుల గిద్ద, సిర్సపల్లి గ్రామాలలో రైతు నేస్తం ప్రారంభం అయింది. హుజూరాబాద్ సహాయ వ్యవసా య సంచాలకులు సునీత మాట్లాడుతూ రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుని అధిక దిగుబడులు సాధించాలని అన్నారు. వ్యవసాయ శాఖ అమలు పరుస్తున్న రైతు నేస్తం కనుకుల గిద్ద, సిర్సపల్లి గ్రామాలలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో సందేహాలు నివృత్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా రైతులతో మాట్లాడి సందేశాన్ని ఇవ్వడమైనది. కార్యక్రమములో ఏవో భూమ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘము హుజురాబాద్ చెర్మన్ కొండల్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమదారులపై క్రమశిక్షణ చర్యలు

### 8వేల జరిమానా, స్వచ్ఛభారత్ చేయించిన మెజిస్ట్రేట్



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా చేసిన ఐదుగురు వ్యక్తులపై కరీంనగర్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.8 వేల జరిమానా, స్వచ్ఛభారత్ చేయించారు. సోమవారం చిగురుమామిడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బల్ల మధు, బురికి ప్రభాకర్, పల్లం నరసయ్య, పైసా అజయ్, అంబిగల్ల వీరమ్మలకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఒక్కొక్కరు రెండు మొ క్కల చొప్పున పాఠశాలల్లో మొక్కలు నాటారు. స్థానిక ఎస్సై ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌ను పర్యవేక్షించారు. ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపైచట్టరీత్యా కఠినచర్యలు చేపడతామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్

**ప్రజాపక్షం/గంగాధర:**గంగాధర మండలం వెంకటయ్యపల్లి గ్రామంలో ఈ నెల 8న జరిగిన దొంగతనం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ సంధర్బంగా గంగాధర పోలీస్‌స్టేషన్‌లో సోమవారం చొప్పదండి సిఐ ఎ.ప్రదీప్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఇప్పటికే విచారణలో భాగంగా ఈనెల 13న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మొత్తం 20 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసిన అనంతరం వారిని జైలుకు తరలించారు. దీంతో పాటు ఈ కేసులో భాగంగా మరొక నిందితుడు చందుర్తి మండలం రామారావుపల్లి వాసి పిట్టల అరవింద్ తండ్రి అంజయ్యను సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 3 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జైలుకు తరలించారు. ఈ ఆపరేషన్‌లో సిఐ చొప్పదండి ఎ.ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్ఐ బి.వంశీ కృష్ణ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కేసుకు సంబంధించి మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సిఐ ప్రదీప్ కుమార్ వెల్లడించారు. త్వరలోనే మిగిలిన నిందితులను సైతం పట్టుకుంటామని ఆయన చెప్పారు.

## గ్రామాల్లో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

**ప్రజాపక్షం/ముత్తారం :** అమ్మ మాట.. అంగన్వాడి బాట కార్యక్రమాన్ని సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు , ముత్తారం గ్రామాల్లో అంగన్వాడి టీచర్లు సత్యవతి, మధుమతి, రజిత, సుజాత తో పాటు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వప్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగాఅమ్మ మాట అంగన్వాడి బాట అనే కార్యక్రమలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి సీతక్క ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓడేడ్ గ్రామంలోముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో అంగన్వాడీ టీచర్ రజిత ఆధ్వర్యంలో అమ్మబాటబడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతి ఇంటింటికి తిరుగుతూ సంవత్సరం నుండి నాలుగు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్ స్వప్న, అంగన్వాడీ టీచర్స్ సత్యవతి, సుజాత, సుమతి, మధుమతి, రజిత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కారు బోల్తా :తప్పిన ప్రాణప్రాయం

**ప్రజాపక్షం / మల్లాపూర్:** గొర్రెపెల్లి గ్రామంలోని అంబేద్కర్ కూడలి లో సమీపాన రహదారి పై ఉన్న బ్రిడ్జి పై నుండి ఆదివారం రాత్రివేళ కారు బోల్తా పడగా, తృటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రేగుంట రహదారి నుండి డ్రైవర్ వాహనాన్ని నడుపుకుంటూ రావడంతో అదుపుతప్పి బ్రిడ్జి పై నుండి కింద పడగా కారు పూర్తిగా ధ్వంసం అయింది. కాగా ఈ కారులో ఆరుగురు వ్యక్తులు ప్రయాణించగా స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం.

## పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గిరిజా షెట్కార్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** పిసిసిరాష్ట్ర కార్య వర్గంలో గిరిజా షెట్కార్‌ను ప్రధాన కార్యద ర్శిగా నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులు జారీ చేసిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొ న్నారు. ఈ మేరకు జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌కు బయలుదేరి ఆమె నివా సంలో గిరిజా షెట్కార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి తమ అభినందనలు తెలియజే శారు. కాంగ్రెస్ అభ్యున్నతి కొరకు కష్టపడి పనిచేసిన ప్రతీ ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ హైదరాబాద్ వెళ్ళిన వారిలో నాయకులు జయప్రదీప్, హన్మండ్లు, సూరత్‌రెడ్డి, గౌస్ రామలిం గంతో పాటు ఆయా మండలాల నాయ కులు, కార్యకర్తలు ఉన్నారు.

## కెటిఆర్‌ను కలిసిన మాజీ జెడ్‌పి చైర్మన్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ జెడ్‌పిచైర్మన్ దఫేదర్‌రాజు సోమ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫార్ములావన్ కారు రేసింగ్‌లో ఏన్ ముద్దా యిగా ఏసీబీ అధికారులు కెటిఆర్‌కు నోటీ సులు ఇవ్వడంతో కెటిఆర్‌ను కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు.

## జిపి భవన నిర్మాణం పూర్తి చేయాలని వినతి



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**మండలకేంద్రం లోని బంజపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలంటూ స్థానిక తహసీల్దార్ బిక్షపతికి సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఎంపిడిఒతో కలిసి తహసీల్దార్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ భవనం లేకపోవ డంతో ప్రజాపాలన కుంటుపడిందని, వెంటనే పక్కా భవనం నిర్మించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపిడిఒ గంగాధర్, కాంగ్రెస్ నాయకులు అనీస్‌పటేల్, రాముురాథోడ్, గాండ్ల రమేష్, జమీల్, పసుల రాములు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: సింగరేణి జిఎం

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :**ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శ్రీరాం పూర్ ఏరియా జనరల్ మేనేజర్ (జిఎం) ఎం. శ్రీనివాస్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏరియాలోని జిఎం కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో అధికారులు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, భారతదేశం యోగాకు పుట్టినిల్లని, యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. హిమాలయ పర్వతాలలో ఎంతోమంది మహనీయులు యోగ సాధన చేస్తున్నారని గుర్తు చేశారు. సింగరేణి సంస్థ తమ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యు లకు ఉచితంగా యోగా నేర్పిస్తుందని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో డిజిఎం ఐఇడి రాజన్న, ఇంచార్జ్ డిజిఎం (పర్సనల్) రాజేశ్వర్, స్టాటా కంట్రోల్ అధికారులు కె. శ్రీధర్, అమర్‌నాథ్ రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ అధికారి హను మాన్ గౌడ్, డివై పిఎం దేవేందర్ రెడ్డి, సీనియర్ పిఒ పి. కాంతారావు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు , రవి, సీనియర్ ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్, యోగా గురువులు సాంబ య్యతో పాటు వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీల ఏర్పాటు

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :**ఎస్‌పి షెడ్యూల్ కులాల వర్గీ కరణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిర్పూర్ (టి) మండలంలో ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. సోమవారం మహారాజుల కాలనీలోని వినాయకుని ఆలయం వద్ద ఎంఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇంచార్జులు గుండా థామస్ మాదిగ, మల్లేష్ మాదిగ హాజరై మాట్లాడారు. ఎస్‌సి షెడ్యూల్ కులాల వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా ఉద్యమం చేస్తున్నామని, ఈ పోరాటంలో అనేకమంది ప్రాణ త్యాగాలు చేశారని, జైలు శిక్షలు అనుభవించారని, లాఠీ దెబ్బలకు గురయ్యా రని గుర్తు చేశారు. వర్గీకరణను సాధించుకున్నామని, ఇప్పుడు ఆత్మగౌరవం, సమానత్వం కాపాడడం కోసం ఎంఆర్‌పిఎస్ నాయకులు ముందుకు రావాలని పిలుపుని చ్చారు. గ్రామస్థాయిలో నూతన కమిటీలు నిర్మించాలని, ప్రతి మాదిగ పల్లెలో జెండా గద్దెలు నిర్మించుకొని జూలై



7వ తేదీ ఉదయం 10 గంటలకు దండోరా జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నూతన మండల ఇంచార్జులను నియమించారు. మండల ఇంచా ర్జిగా ఉట్ల సిద్ధార్థ, కోఇంచార్జులుగా ఇప్పస్వామి, నేరెళ్ల అశోక్, ఇప్ప రవిశంకర్, గద్దల ప్రవీణ్, నేరెళ్ల శోభన్ బాబు, గద్దల రమేష్, బందరు గంటి సురేష్, నేరెళ్ల కార్తీక్ తదితరులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో పలు వురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు

**ప్రజాపక్షం / మందమర్రి:**సింగరేణి యాజమాన్యం మందమర్రి ఏరియా లోని అన్ని గనుల డిపార్ట్‌మెంట్లలో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు జిఎం జి. దేవేందర్ తెలిపారు. సోమవారం జిఎం కార్యాలయంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించి, ముందస్తుగా శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా జిఎం మాట్లా డుతూ ప్రతిరోజు ఒక గంట సమ యాన్ని యోగాసనాలకు కేటాయించి నట్లయితే శారీరక ఆరోగ్యం, మాన



సిక ఉల్లాసం కలుగుతాయని అన్నారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యమే మహాభాగ్యమని, శరీరానికి యోగా చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యంతో పాటుగా ఉత్పత్తి, ఉత్పాదకత, రక్ష ణతో కూడిన ఉత్పత్తిని సాధించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి. రమణ, డిప్యూటీ జనరల్ మేనే జర్ (సివిల్) రాము, ఐఇడిఎస్ ఇకె. కిరణ్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ ఆసిఫ్, ఫారెస్ట్ అధికారి రమణా రెడ్డి, ఐటి డిప్యూటీ మేనేజర్ రవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పలువురు కుటుంబాలను పరామర్శించిన పివిఆర్

**ప్రజాపక్షం/ఆర్మూర్:**ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ ంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బట్టు నాగార్జున గత కొద్దిరో జుల క్రితం దుబాయ్ (అబుదాబి) కు బతుకు దెరువు కోస ం వెళ్లాడు. ఆ దేశంలో వారు అక్కడ మానసిక పరిస్థితి దెబ్బ తినడం కారణంగా తప్పిపోయాడు. విషయం తెలిసినప్పటి నుండి కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. జరిగిన విషయా న్ని ఆర్మూర్ మండల అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డి ద్వా రా తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి వారికి అండగా ఉండి తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి తగిన స హాయం చేపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పల్లె గ్రా మంలో ప్రమాదవశాత్తు కాలు విరిగిన డాక్టర్ సత్యనారా యణను కూడా పరామర్శించి ఆరోగ్య పరిస్తితి తెలుసుకు న్నారు. మీరు పెద్ద రాజన్న ఇటీవల మరణించడంతో వారి ఇంటికి కూడా వెళ్ళి పరామర్శించారు. అదేవిధంగా కొండా చిన్నాయన కూడా పరామర్శించి ఆరోగ్యపరిస్తితి తె



లుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ లబ్దిదారులకు ప్రొ సిడింగ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చేపూర్ పల్లె గ్రామ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు దాసరి శ్రీకాంత్, రామ్సన్ మాజీ ఎంపిటిసిలు ఎల్క రంజిత్, జన్నేపల్లి గంగాధర్, న్యాయవాది చరణ్, పల్లె విడిసి అధ్యక్షులు బీరయ్య, కోశా ధికారి బిల్లర్ శంకర్, సెక్రెటరీ ఎ. శంకర్, రామాలయ కమిటి ఛైర్మన్ రాంపట్ల నర్సయ్య, కోశాధికారి కపిల్ గౌడ్, గ్రామస్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి సన్మానం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఒకేష నల్ ఆఫీస్ అసిస్టెంట్ షిప్ కోర్స్ మొదటి సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలలో 500 మార్కులకు గాను అత్యు త్తమ 493 మార్కులు సాధించిన విద్యార్థినిని జిల్లా ఇంటర్ విద్యాధి కారి తిరుమలపుడి రవికుమార్ సోమవారం తన కార్యాలయంలో సన్మానించారు. శ్రీహర్షినిని జిల్లా ఇంటర్ విద్యాధికారి అభినం దిస్తూ రెండవ సంవత్సరంలో కూడా అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్‌ను, ఒకేషనల్ ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ అధ్యాపకులను జిల్లా ఇంటర్ విద్యాధికారి అభినందించారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన బిజెపి నాయకులు



**ప్రజాపక్షం /నందిపేట్:**నందిపేట్ మండల తహసీల్దార్ సంతోష్‌ను సోమవారం మండల బిజెపి నాయకులు ఆయన కార్యాలయంలో సన్మానించారు. రైతుల సమస్యలపై, రెవెన్యూ సమస్యలపై సహ కారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల రమేష్, ఎలిగేట్ రాజు, రవి కిషన్, గంగాధర్, గాండ్ల నర్సాగౌడ్, చింత శ్రీనివాస్, ఎర్రం లింగం తదితరులు పాల్గొన్నారు.

## చురుకుగా సాగుతున్న ఖరీఫ్ పనులు



**ప్రజాపక్షం /నందిపేట్ :**నందిపేట్ మండలంలో ఖరీఫ్ పనులు చురుకుగా సాగుతున్నాయి. నాలుగైదు రోజులు వర్షాలు పడి సాగు భూములు మంచిగా నాని దుక్కులు వస్తున్నాయి. చాలా మంది రైతులు పంట భూములను చదును చేసుకొని సిద్ధంగా ఉంచుకుం టున్నారు. మళ్ళీ వర్షాలు పడకపోవడం రైతులకు మేలు జరిగింది. చెరువులు, మెట్టభూములు దున్ని చదును చేసుకుంటున్నారు. రైతులు బోరు బావుల వద్ద నారు పోస్తున్నారు. కలుపు మొక్కలను, పొదలను తొలగించుకుంటున్నారు. ట్రాక్టర్ యజమానులకు గిరాకీ పెరిగింది. ముందుగా నారు పోసుకున్న రైతులు కలకత్తా, బీహార్ కూలీలు రావడంతో నాట్లు చురుకుగా సాగుతున్నాయి. చాలా మంది రైతులు స్వల్పకాలిక సన్నాలు నాటుతున్నారు. సకాలంలో వర్షాలు పడితే నాట్లు ముమ్మరంగా సాగుతాయి. ఈ పాటికే రైతులు కాంప్లెక్సు ఎరువులు తెచ్చుకున్నారు.

## వాంకిడిలో నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

**ప్రజాపక్షం / వాంకిడి:**ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ వెల్ల డించారు. సుమారు రూ. 15 వేల విలువైన 5 కేజీల నకిలీ విత్తనా లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ ప్రశాంత్ వివరాలు వెల్లడించారు. వాంకిడి మండలంలోని బంబార గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, మహా రాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న ఎంహెచ్ 34 ఎహెచ్ 0391 నంబర్ గల బైక్‌ను గుర్తించారు. బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న మహారాష్ట్రలోని రాజుర తాలూకా, సుకడ్‌పల్లికి చెందిన మాడావి మోతీరామ్‌ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, అతని వద్ద నకిలీ పత్తి విత్తనాలు లభ్యమయ్యాయని వెల్లడించారు. పట్టుబడిన విత్తనాలను మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో పంచనామా నిర్వహించి, స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎఎస్ఐ పోశెట్టి పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ఎస్‌సి, బిసి కాలనీ, ప్రాథమిక పాఠశాలలో యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల ల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపిసిసి మహేందర్, ఉపాధ్యాయులు విట్టల్, మానస, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం కాన్ఫరెన్స్‌లో రైతులు



**ప్రజాపక్షం/మోర్తాడ్:**తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా నూతనంగా సోమవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లో మోర్తాడ్ మండల రైతులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రసరమైన మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు పాలెం, దంకల్ రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొని, సీఎం చెప్పిన రైతు నేస్తంపై రైతులు అవగాహన పెంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్ కుమార్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీలత, లక్‌పతి, రైతులు రాములు, మురళి, మహిపాల్, భూమన్న, శ్రీనివాస్, అశోక్‌లు పాల్గొన్నారు.



**బోధన్:**తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా నూతనంగా సోమవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లో వర్ని మండల ల రైతులు రైతులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రసరమైన వర్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొని, సీఎం చెప్పిన రైతు నేస్తంపై రైతులు అవగాహన పెంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసీ వైస్ ఛైర్మన్ వెలగపూడి గోపాల్, రైతు నాయకుడు వైఎస్ఆర్ బుజ్జి, ఎఈఓ అరుణ్, వర్ని పిఎసిఎస్ సీఈఓ గంగాధర్, వర్ని ఎఎంసీ కార్యదర్శి, వర్ని మండల రైతులు పాల్గొన్నారు.

# తండ్రిని రోకలి బండతో కొట్టి చంపిన కూతురు

## నిజామాబాద్ జిల్లాలో దారుణం



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం ధర్మారం గ్రామంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కన్న కూతురే తన తండ్రిని రోకలి బండతో కొట్టి హత్య చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మారం గ్రామానికి చెందిన పుల్లెపు నరసయ్య(55)ను ఆయన కుమార్తె మమత రోకలి బండతో తలపై బలంగా బాదడంతో నరసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో తండ్రి, కూతుళ్ల మధ్య జరిగిన గొడవ తీవ్రమై ఈ ఘాతుకానికి దారితీసినట్లు తెలుస్తుంది. దాడి అనంతరం, నిందితురాలు మమత స్వయంగా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిజామాబాద్ ఏసీపీ రాజ వెంకట్ రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. మృతుడు పుల్లెపు నరసయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నారు.

# ప్రతిభా జూనియర్ కళాశాల యాజమాన్యంపై విద్యార్థుల ఆగ్రహం

## సర్టిఫికెట్ల కోసం ఆందోళన



**ప్రజాపక్షం/మంచిర్యాల :**మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఉన్న ప్రతిభా జూనియర్ కళాశాల యాజమాన్యంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న తమ సర్టిఫికెట్లను ఇవ్వకుండా కళాశాల గేటుకు తాళం వేసి, ఎవరినీ లోపలికి అనుమతించకపోవడంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సర్టిఫికెట్లు లేక ఉన్నత విద్యకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత తమ సర్టిఫికెట్ల కోసం ప్రతిభా జూనియర్ కళాశాలకు వెళ్లగా, కళాశాలకు పూర్తిగా తాళం వేసి ఉంది. అంతేకాకుండా, ప్రవేశం లేదు. ప్రవేశించినచో కేసులు నమోదు చేయబడతాయి అని ఒక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కళాశాల యాజమాన్యంతో ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించగా, వారి ఫోన్లు స్విచ్చాఫ్ వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులైన వంశీ, నితిష్ లు స్పందిస్తూ, ప్రతిభా కళాశాల యాజమాన్యం తీరు దారుణంగా ఉందని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడం తగదని వారు హెచ్చరించారు.

ప్రతిభా కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు, గాయత్రీ, ఎ. అబిజ్ఞ, ఎస్. దివ్య, ఎస్. మాధురి, జి. అక్షయ, కె. కిరణ్మయి, టి. శ్రీజ మాట్లాడుతూ, తమ సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల ఉన్నత చదువుల కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే తమ సర్టిఫికెట్లను ఇప్పించి, ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి (డిఐఇఒ) జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

# సర్వే నంబర్ 290 భూ బాధితుల ఆందోళన

## న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :**మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల శివారులోని తిలక్ నగర్‌లో నెలకొన్న సర్వే నంబర్ 290 భూ వివాదంపై బాధితులు సోమవారం స్థానిక ఎంఆర్ఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. తమ హక్కులను పరిరక్షించుకోవాలని, కోల్పోయిన తమ భూమిని తిరిగి పొందాలని ఆకాంక్షిస్తూ శాంతియుత ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ముదాం శ్రీనివాస్ పేరు మీద మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 1 ఎకరం 25 గుంటల భూమి రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రిజిస్ట్రేషన్ వెనుక అక్రమాలు జరిగాయని, అమాయక ప్రజలను మోసం చేసి వారి భూములను లాక్కున్నారని వారు ఆరోపించారు. గత ఏప్రిల్ 17, 2025న డిఐ, ఎంసి, ఆర్ఐ అధికారులు సర్వే చేసిన నివేదికను వెంటనే తమకు అందజేయాలని, నివేదిక తమకు న్యాయం చేకూర్చడంలో కీలకమని, దీనిని అధికారులు గోప్యంగా ఉంచడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఇది కేవలం భూమి కోసం జరిగే ఆందోళన కాదని, న్యాయం కోసం సాగే ఒక అవిశ్రాంత పోరాటం అని బాధితులు స్పష్టం చేశారు. తమ భూమి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ నిరసన కొనసాగుతుందని వారు ప్రతిన బూనారు. బాధితుల వినూత్న, శాంతియుత ఆందోళనలు ప్రజల దృష్టిని ఆకర్షించి, ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించి, న్యాయపరమైన పరిష్కారానికి దారితీస్తాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**ప్రజాపక్షం/మాక్లూర్ :**మండలంలోని కొత్తపల్లి గ్రామశివారులో ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో జన్నెపల్లి గ్రామానికి చెందిన నూతుల అబిషేక్ (26) యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం దేవినేని రాజేష్ పొలం పనులు ముగించుకుని ట్రాక్టర్‌పై లేబర్సను తీసుకెళుతుండగా ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఒకేసారి బలంగా గుద్దుకోవటంతో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించటంతో సోమవారం మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

# రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**రైతునేస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నూతనంగా 1031 రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ రైతు వేదికలో స్థానిక నాయకులు, అధికారులు కలిసి ప్రారంభించారు. వర్షాకాలంలో రైతు భరోసా ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఆడిటోరియం నుండి ప రారంభించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట్ రైతు వేదిక ప్రత్యేకాధికారిగా ఎంపీడీఓ గంగాధర్, వ్యవసాయాధికారి అమర్‌ప్రసాద్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు స్వర్ణలత, సాగర్, ప్రజాప్రతినిదులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్‌గా వినోద్‌రెడ్డి నియామకం




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:**తైక్వాండో అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్‌గా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లికి చెందిన వినోద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాజిజ్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో నియామకం చేపట్టినట్లు జిల్లా అధ్యక్షులు అజ్మత్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్న్ జిల్లాలోని పలువురు క్రీడా ప్రతినిధులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# నందిపేట్‌లో రైతు నేస్తం ప్రారంభం



**ప్రజాపక్షం /నందిపేట్ :**నందిపేట్ మండల కేంద్రంలో సోమవారం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో రైతులతో ముఖ్యమంత్రి మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నందిపేట్, చింరాజ్‌పల్లి, ఖుదావంద్ పూర్ రైతు వేదికలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్ గంగారెడ్డి, విస్తరణాధికారులు రైతులు పాల్గొన్నారు.

# ఐఐటీలో సీటు సాధించిన బోధన్ విద్యార్థి



**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ పట్టణానికి చెందిన విద్యార్థి ఐఐటిలో సీటు సాధించాడు. ఆల్ ఇండియా లెవెల్‌లో నిర్వహించిన ఐఐటి ప్రవేశ పరీక్ష ఫలితాలలో బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్‌కు చెందిన కారం స్వామి లత దంపతుల కుమారుడు ప్రణయ్ సాయి 2079 ఆల్ ఇండియా ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ప్రణయ్ సాయి సీటు సాధించడం పట్ల పలువురు విద్యార్థుడిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియచేశారు.

## ఎంఎల్ఏ వెడ్మ బొజ్జు జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం / జన్నారం :**ఖానాపూర్ నియోజకవర్గ ఎంఎల్ఏ వెడ్మ బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలను సోమవారం జన్నారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజఫర్ అలీ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ, సీనియర్ నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, గుర్రం మోహన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యురాలు పంకజ, ఏనుగు శుభాష్ రెడ్డి, ఇసాక్, ముత్యం సతీష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, నాయకులు ఎంఎల్ఏకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ పట్టణంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో అమ్మ మాట , బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని వార్డు నంబర్ పదిలో బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ జానకి హాజరై మాట్లాడారు. అంగన్‌వాడి కేంద్రాలలో నర్సరీ నుంచి యూకేజీ వరకు తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాలనీలోని తల్లిదండ్రులు వారి చిన్న పిల్లలను అంగన్‌వాడి కేద్రాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అంగన్‌వాడి కార్యకర్త, ఆయా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం



**ప్రజాపక్షం /సిర్పూర్ (టి) :**మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు లేకపోవడంతో తమ పిల్లల చదువు వెనకబడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం వారు స్థానిక మండల విద్యాధికారి వేణుగోపాల్‌కి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ పిల్లల చదువు పట్ల తీవ్ర ఆందోళనతో వినతి పత్రాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో గణితం బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడం వల్ల గత సంవత్సరం నుండీ విద్యార్థులు బాగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవ తరగతి పరీక్షల సమయంలో ఇది మరింత ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని వారు తెలిపారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, యుపిఎస్ ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయులు సయ్యద్ మజహర్‌ను తాత్కాలిక డెప్యూటేషన్‌పై జడ్‌పిఎస్‌ఎస్ పాఠశాలకు పంపవలసిన అవసరం ఎంతైనా ఉందని విన్నవించారు. విద్యార్థుల ప్రయోజనం దృష్ట్యా ఉత్తమ నిర్ణయం తీసుకొని, వెంటనే చర్య తీసుకోవలసిందిగా ని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులైన ఎండి ఇఫాత్ హుస్సేన్, అబ్దుల్ ఫాజీల్, మకాసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నష్టం కలిగించే జిఓ 49 రద్దు చేయాలి

### ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :**ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ఆసిఫాబాద్ టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జిఓ 49ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సిర్పూర్ ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. గిరిజనులకు, గిరిజనేతరులకు నష్టం వాటిల్లే జిఓ నం.49ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పార్టీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్రావు, మాజీ ఎంపిపి అరిగెల మల్లిఖార్జున్‌లతో కలిసి జిఓకు సంబంధించిన ప్రతులను పార్టీ శ్రేణులతో కలిసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ, ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జిఓ నం. 49ను తీసుకొచ్చి జిల్లా ప్రజలకు అన్యాయం చేసిందని విమర్శించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గంలోని సుమారు 4 లక్షల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటించడంతో అభివృద్ధి కుంటుపడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిఓ 49పై ఆదివాసీలు ఆందోళన చేస్తుంటే గిరిజన మంత్రి సీతక్క స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ జీఓను ప్రభుత్వం రద్దు చేసేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, దశలవారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సెర్ల మురళీధర్, దీపక్, ప్రహ్లాద్, జయరాజ్, శ్రావణ్, ప్రసాద్ గౌడ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌పిని కలిసిన ఎంఎల్ఏ



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :**జిల్లా ఎస్‌పిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పటేల్ కాంతిలాల్ సుభాష్ను సిర్పూర్ ఎంఎల్ఏ హరీష్ బాబు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, చట్టం ముందు అందరూ సమానమేనని ఆయన కోరారు. ఎస్‌పిని కలిసిన వారిలో బిజెపి సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, నాయకులు ప్రసాద్ గౌడ్, మాటూరి జయరాజ్, మల్లేష్ యాదవ్ తదితరులు ఉన్నారు

# భూ సమస్యల పరిష్కారినికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఎడపల్లి మండలంలోని రైతులకున్న భూ సమస్యల పరిష్కారినికి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ దత్తాత్రి తెలిపారు. సోమవారం ఎడపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేది నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని, రైతులు తమకున్న భూ సమస్యలపై ఈ సదస్సులలో దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 698దరఖాస్తులు స్వీకరించగా సోమవారం ఎడపల్లిలో నిర్వహించిన సదస్సులో 149దరఖాస్తులు అందాయని ఆయన పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం ఇప్పటి వరకు దరఖాస్తులు సమర్పించని వారు తమ భూ సమస్యలను సమర్పించేందుకు వీలుగా నేటి నుంచి ఈ నెల 20వ తేది వరకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు దత్తాత్రి వెల్లడించారు. భూ సమస్యలున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రత్యేక కౌంటర్ ద్వారా రైతుల భూ సమస్యల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీలో 57.46 శాతం ఉత్తీర్ణత

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**జిల్లాలో 202425 విద్యా సంవత్సరానికి గాను గత మే లో జరిగిన సప్లమెంటరీ పరీక్షలలో జిల్లాలో 57.46 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. జనరల్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 6497 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 3733 మంది విద్యార్థులు పాసయ్యారని 57.46 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే ఒకేషనల్ సెకండియర్‌లో మొత్తం 899 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 503 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని మొత్తం 55 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 10098 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 5851 మంది విద్యార్థులు పాసయ్యారని 58 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో 1420 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా 903 మంది విద్యార్థులు పాసై 63.59 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద రెండవ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం 20వ స్థానంలో ఉండగా మొదటి సంవత్సరం ఉత్తీర్ణత శాతం 26వ స్థానంలో ఉందని కాగా పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ వెరిఫికేషన చేసుకోవాలనుకునే వారు ఈనెల 17 నుండి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తెలిపారు.

## డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/బోధన్:**నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సోమవారం బోధన్ పట్టణ సిఐ వెంకట్ నారాయణ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్ నారాయణ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వారికి సిఐ వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ఎస్ఐ మనోజ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను పరిశీలించిన సబ్ కలెక్టర్



**ప్రజాపక్షం/బోధన్:**నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని మోస్రా మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రెవెన్యూ దరఖాస్తులను ఆయన పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సులను రైతులు ఉపయోగించుకొని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి:**మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుంటాల రాములు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెస్, కొడిగుడ్డు, రాగి జావ బిల్లులులతో పాటు 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం నాయకులు రాంబాయి, సత్యమ్మ పాల్గొన్నారు.

# ఏకపక్షంగా డివిజన్ల పునర్విభజన



ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజనను పారదర్శకంగా, శాస్త్రీయంగా చేపట్టడంలేదని, ఈ విషయమై హైకోర్టును ఆశ్రయిస్తామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేసినట్లు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. డివిజన్ల పునర్విభజన ఏకపక్షంగా జరగుతుందని, అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారిని వెంటనే బదిలీ చేయాలని కోరినట్లు తెలిపారు. డివిజన్ల పునర్విభజన ప్రక్రియలో కొన్ని ఇళ్లు, దళిత సామాజిక వర్గ ఓటర్ల పేర్లు గల్లంతు అయ్యాయన్నారు. ఏలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా కార్యాలయంలోనే కూర్చొని సిబ్బంది ఈ పక్రియను చేపట్టారన్నారు. ప్రధానంగా 33వ డివిజన్‌లో అత్యధికంగా ఎస్సీ ఓటర్లు ఉండగా ఈ డివిజన్‌ను రెండు ముక్కలు చేసి ఎస్సీ రిజర్వేషన్ కాకుండా చేశారన్నారు. ఈ డివిజన్ గతంలో ఉన్న మాదిరిగానే కొనసాగించాలని కలెక్టర్‌ను కోరినట్లు దినేష్ తెలిపారు.

## పోడు భూములకు పట్టాలివ్వాలి

ఎఐయుకెఎస్ అధ్వర్యంలో ధర్నా

ప్రజాపక్షం/భీమ్‌గల్: ఎన్నో యేండ్లుగా పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని కోరుతు కమ్మర్‌పల్లి మండల ఆఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం అధ్వర్యంలో సోమవారం నాడు తాసీల్దార్ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఐయుకెఎస్ నాయకులు మాట్లాడుతు పోడు భూముల రైతులను ఆటవిశాఖా అధికారులు కేసుల పేరుతో తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని మండిపడ్డారు.గత యాభై సంవత్సరాల నుండి భూమిని సాగు చేస్తున్న రైతులకు వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చెశారు.గత ప్రభుత్వం పట్టాలు స్తామని మాట ఇచ్చి తప్పిందన్నారు.మీని కూడా అమలు చేయడం లేదన్నారు.కాంగ్రెస ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క మపోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పోడు భూముల రైతులు తదితరులు పాల్గోన్నారు.

## రైతు భరోసా ప్రారంభ కార్యక్రమంలో రైతులు

ప్రజాపక్షం/భీమ్‌గల్:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకత్మకంగా చెపట్టిన రైతు నేస్తం,రైతు భరోసా ప్రారంభ కార్యక్రమం మండలంలోని మెండోరా రైతువేదికలో రైతులు పెద్ద ఎత్తున పాల్గోన్నారు.సోమవారం నాడు ప్రారంభైన కార్యక్రమంలో మండల నోడల అధికారి సంతోష్ కుమార్ ,మచ్కుర్ సోసైటి చైర్మన్ బంగ్ల నర్సరెడ్డి,డిసిసి ప్రధాన కార్యదర్శి కుంట రమేష్ పాల్గోన్నారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ సర్కారు రైతులకు రైతు భరోసాను కల్పింస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ చిన్నారెడ్డి ,మాజీ మున్సిపల చైర్మన్ కన్నే ప్రేమలత సురేంధర్,పట్టన కాంగ్రెస పార్టీ అధ్యక్షుడు జెజె నర్సయ్య,కాంగ్రెస్ నాయకలు నీలం రవి,పల్లె శేఖర్ రాములు నాయక్ తదితరలు పాల్గోన్నారు.

## నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాపక్షం/నిజాంపేట్: విద్యార్థులు శ్రద్ధతో చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఉపాధ్యాయులు దశరథం అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండలం నందగోకుల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దశరథం తన సొంత డబ్బులతో 200 నోట్ బుక్స్, పెన్సిల్, పెన్నులను కొనుగోలు చేసి విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు గణేష్, షాదులు కార్యదర్శి భాగ్యలక్ష్మి, మ్యాదరి నర్సిములు తదితరులు ఉన్నారు.

## అనుమతిలేని పాఠశాలలపై చర్యలకు ఫిర్యాదు



ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం పెద్దపల్లిలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుకు ఫిర్యాదు చేసినట్లు బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ తెలిపారు. తప్పుడు ధృవీకరణ పత్రాలు చూపిస్తూ తల్లిదండ్రులను అయోమయంలోకి నెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రుల వద్ద నుంచి డబ్బులు దండుకుంటున్నారన్నారు. విద్యాశాఖ అధికారుల సహకారంతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయన్నారు. తక్షణం విచారణ జరిపి అనుమతుల్లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

## చిన్నారులకు ఘనంగా అక్షరాభ్యాసం




ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వేగోళపు సదానందం ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీలో నూతనంగా చేరిన 22 మంది విద్యార్థులు 1.వ తరగతిలో నూతనంగా చేరిన 8 మంది విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం ప్రభుత్వం నుండి వస్తున్న నిధులతో పాఠశాలలో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసుకుని నాణ్యమైన గుణాత్మకమైన విద్యను పిల్లలకు అందించడం ద్వారా గ్రామ ప్రజలలో నమ్మకం ఏర్పడి నర్సరీ నుండి ఐదవ తరగతుల వరకు వివిధ తరగతులలో సుమారు 40 మంది నూతన విద్యార్థులు పాఠశాలలో నమోదు కావడం జరిగిందని,సమీప గ్రామమైన ముత్తారం నుండి సుమారు 15 మంది ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పారుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నమోదు కావడం గొప్ప విజయంగా భావిస్తున్నామని, అలాగే ఈ విద్యా సంవత్సరం నుండి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రోగ్రామ్ని పాఠశాలలో ఇంప్లిమెంట్ చేస్తున్నట్టుగా ప్రకటించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎడపల్లి సోసైటీ భూమి ఆన్‌లైన్ రికార్డుల నుంచి గల్లంతు

రెవెన్యూ సదస్సులో చైర్మన్ ఫిర్యాదు



ప్రజాపక్షం/ఎడపల్లి:నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని సహకార సంఘానికి చెందిన 1.39 ఎకరాల భూమి ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల నుంచి అదృశ్యమైందని, ఆ భూమిని తిరిగి సోసైటీ పేరు మీద చేర్చాలని కోరుతూ ఎడపల్లి సోసైటీ ఛైర్మన్ పోలా మల్కారెడ్డి, నాయకులు, సోసైటీ సిబ్బంది సోమవారం ఎడపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారుల నుంచి రెవెన్యూ సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా సోసైటీ ఛైర్మన్ పోలా మల్కారెడ్డి మాట్లాడుతూ.. ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు పంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న సోసైటీకి చెందిన 1.39ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల నుంచి మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూమిని గత 201920 ఆర్థిక సంవత్సరంలో రికార్డులో సరిచేయడం జరిగిందని, అయితే ఇటీవల భూమికి సంబంధించిన పహాణి చూడగా అది సోసైటీ పేరు మీద కనిపించడం లేదని ఆయన తెలిపారు. దీనిపై ఎడపల్లిలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేయడం జరిగిందని మల్కారెడ్డి వివరించారు. ఈ భూమి గల్లంతుపై తక్షణమే విచారణ చేపట్టి, తిరిగి సోసైటీ పేరు మీద రికార్డుల్లో చేర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మాజీ సర్పంచ్ ఎల్లయ్య యాదవ్, సోసైటీ సెక్రెటరీ రాజారాం, పలువురు రైతులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సమావేశం

ప్రజాపక్షం/భీమ్‌గల్: భారతీయ జనతాపార్టీ అధికారం చెపట్టి పదకోండు సంవత్సరాలు పూరైన సందర్భంగా మండల పార్టీ రూరల కార్యకర్తల సమావేశాన్ని బాచన్‌పల్లిలో సోమవారం నాడు అధ్యక్షుడు ఆరే రవీంధర్ అధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా రవీంధర్ మాట్లాడుతు నియోజక వర్గ ఇంచార్జీ ఏలేటి మల్లీకార్జున్ రెడ్డి ఆదేవాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.కార్యకర్తలతో మాట్లాడుతు గత పదకోండు సంవత్సరాలలో బిజేపి ప్రభుత్వం ఎన్నో సంక్షుమ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు వాటిని అందరికి అందజేసిందన్నారు.ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకేల్లాల్సిన భాద్యత ప్రతి ఒక్క బిజేపి కార్యకర్తలపై ఉందన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ సత్తాను చాటుదామన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 420 హామీలను ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా కుంటాసాకులు చెబుతుందన్నారు.కాంగ్రెస పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేమడంలో విపలమైందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు.ఈ సమావేశంలో నాయకలు మోహన్,రామకృష్ణ,రాజేశ్,రజీనికాంత్,అశోక్,దేవిదాస్ కార్యకర్తలు తదితరలు పాల్గోన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మోహన్ రెడ్డి

ప్రజాపక్షం/భీమ్‌గల్: బాల్కోండ నియోజకవర్గంలోని ఏర్గట్ల మండలంలో పలు బాధిత కుటుంబాలను రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి సోమవారం నాడు పరామర్శించాడు.ఈ సందర్భంగా తడపాకల్,తాళ్ళరాంపూర్ మాజీ ఎంపిటిసి ఆడెం సవితను,ఏర్గట్ల మాజీ సర్పంచ్ పిట్ల మీనా మరనించడంతో వారి కుటుంబ సభ్యులను,మునిమాణిక్యం కుటుంబ సభ్యులను మోహన్‌రెడ్డి సపరామర్శించారు.ఈయన వెంట ఏర్గట్ల మండల కాంగ్రెస పార్టీ అధ్యక్షుడు సోమా దేవరెడ్డి,నాయకలు రేండ్ల రమేష్,గంగాప్రసాద్,రాజారెడ్డి,సంజీవ్,రాజేశ్వర్,మహేష్ తదితరులు ఉన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు డ్రస్సులు నోటుబుక్కులు పంపిణీ

ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సోమవారం రోజున ప్రైమరీ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోటుకు నోటుబుక్కులు డ్రెస్సులు పంపించడం జరిగింది. ఈ మేరకు నస్కల్ ప్రాథమిక పాఠశాలల్లో హెచ్ఎం సాగరిక ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పాఠశాల అభివృద్ధి కొరకు అందరు పాటు పాడాలని పాఠశాలలో మౌలిక వసతుల కోసం తల్లిదండ్రులుగా ఉపాధ్యాయులుగా మా బాధ్యత కూడా ఉంటుందని తెలిపారు. మనమందరం పిల్లల బాగు కోసం భవిష్యత్తు కోసం పాఠశాల అభివృద్ధి కోసమే పనిచేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్బుక్ లు, డ్రెస్సులు తల్లిదండ్రుల సమక్షంలో ఉపాధ్యాయుల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎల్లం, శేఖర్, జాకియా, సుమలత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాల వ్యాపారాన్ని అరికట్టాలి

ప్రజాపక్షం/నిజాంపేట్: కనీస వసతులు లేని ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలని యుఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా అధ్యక్షుడు జగన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్య హక్కు చట్టాన్ని అమలు చేయకుండా ఇష్ట రాజ్యాంగ ప్రైవేట్ స్కూళ్ళు నడుస్తున్నాయని ఆయన మండిపడ్డారు. డొనేషన్, అడ్మిషన్ యూనిఫామ్, నోట్ బుక్స్ ఇతర కారణాలతోటి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఫీజుల లిస్టు స్కూల్ ఆవరణలో లేకుండానే ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫిట్నెస్ లేని బస్సులను అధికారులు సీజ్ చేయాలని ఆయన అన్నారు.

ప్రతి ఒక్క వస్తువులపై తమ స్కూల్ పేరు వాడుతూ ఒక వ్యాపారంగా తీసుకొస్తున్నారని పరిమిషన్ లేకుండా స్కూల్ నోట్ బుక్స్ అమ్ముతున్న ప్రైవేట్ స్కూళ్ళ పై మండల విద్య అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు.